చిరుత చిక్కింది

- నెహ్రూ జూపార్కుకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎట్టకేలకు సంగారెడ్డి జిల్లా జిన్నారంలో చిరుత చిక్కింది. జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటిరో డ్రగ్స్ పరిశ్రమలోకి శనివారం తెల్లవారుజామున చిరుత ప్రవేశించింది. పరిశ్రమలోని ఎఫ్ బ్లాక్‌లో దాగి ఉన్న చిరుతను గమనించిన కార్మికులు భయాందోళనకు గురై వెంటనే బయటకు వచ్చి తాళాలు వేశారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బోను, వల ఏర్పాటు చేశారు. సుమారు 8 గంటలపాటు శ్రమించినా చిరుత చిక్కలేదు. చివరకు హైదరాబాద్ నుంచి వచ్చిన జూ అధికారులు తుపాకీ ద్వారా చిరుతకు మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో మత్తులోకి జారుకుంది. ఆ తర్వాత చిరుత బోనులో బంధించారు. అనంతరం హైదరాబాద్ జూపార్కుకు తరలించారు. మూడు నెలల కిందట ఇదే పరిశ్రమలోని ఇదే బ్లాకులో చిరుత సంచరించి వెళ్లింది.

గెస్ట్ లెక్చరర్ల జీతాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల జీతాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం లక్ష్మారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్, అక్టోబర్‌కు సంబంధించిన జీతాల కోసం రూ.9.28 కోట్లు విడుదల చేశామని వివరించారు. వారికి ఒక పీరియడ్‌కు రూ.390 చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. అంటే నెలకు గరిష్టంగా 72 పీరియడ్లు మాత్రమే వారు బోధించాల్సి ఉంటుందని వివరించారు. ఈలెక్కన వారికి నెలకు రూ.28,080 మించకుండా గౌరవ వేతనం వస్తుందని తెలిపారు. జీతాలను విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రులు పి సబిత ఇంద్రారెడ్డి, టి హరీశ్‌రావుతోపాటు విద్యాశాఖ అధికారులకు గెస్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ ధన్యవాదాలు ప్రకటించారు.

శీతాకాల సమావేశాలు లేనట్టే!

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సాధారణంగా జరగాల్సిన శీతాకాల అసెంబ్లీ సమావేశాలు ఈసారి జరిగే అవకాశం కనిపించడం లేదు. బిఆర్ఎస్ పార్టీ విస్తరణ కార్యక్రమాల్లో సిఎం కెసిఆర్ బిజీగా ఉండటం, మరోవైపు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై లిక్కర్ స్కామ్ ఆరోపణలు, ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో సిట్ విచారణ కొనసాగుతుండటం...తదితర అంశాలు చర్చనీయాంశమవుతాయనే అధికార పార్టీ వెనకడుగు వేస్తున్నట్టు తెలిసింది. ప్రతి ఆర్నెల్లకొసారి అసెంబ్లీ సమావేశాలు జరగాల్సిన ఉండగా, ఈసారి మార్చి నెలాఖరులోపు సమయం ఉంది. దీంతో అసెంబ్లీ సమావేశాలు డిసెంబర్‌లో జరపకపోయినా ఎలాంటి ఇబ్బందులు వచ్చే పరిస్థితులు లేవని అధికార పార్టీ వర్గాలు అంటున్నాయి.

COURT NOTICE
IN THE COURT OF THE MACT CUM XI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT AT :: HYDERABAD
O. P. No. 3129 of 2017

BETWEEN:
1. T.Somanath (Died per LR)
2. Thunga Rajitha W/o Late T. Somanath,
...Petitioner
AND
1. Mamilla Terun Reddy.
2. Bajaj Allianz General Insurance Company Ltd.,
3. Mamilla Bachi Reddy S/o M.Keshava Reddy
...Respondents.

To
1. Mamilla Tarun Reddy S/o M. Bachi Reddy,Age:Major, Occ: Owner of Maruthi Vitara Brezza Car No. TS-07-FJ-5000, R/o.H.No:28-206/3/A, lyappa Colony,Shadnagar, Farooqnagar, Ranga Reddy District-509 216.
3. Mamilla Bachi Reddy S/o M.Keshava Reddy, Age:Major,Occ:Driver of Maruthi Vitara Brezza Car bearing No. TS-07-FJ-5000, R/o H,No. 28-206/3/A, lyappa Colony,Shadnagar, Faroocragar, Ranga Reddy District-509 216.
...Respondents. No.1 & 3.

Take notice that, the above said O.P. is filed by petitioners against you and Respondent No.2 claiming the compensation under MV.Act. for the sustareed to the petitiner No.1 in a road accident which was occurred on 14-07-2017 at about 15-30 Hours at Ganapur Village, Jadcherla Mandal, Mahaboobnagar District, in the limits of PS. Jadcherla and the same is posted to **23-12-2022** at 10-30 AM for your appearance before the above said court. Hence you are hereby directed to appear before the above said court at 10-30 a.m.on the above said date either in person of through an advocate dully authorized failing which the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
K. SRINIVAS REDDY
D. RAJU
Advocates
Flat No.104, Jamuna Towers
Nalgonda X Roads,
Malakpet, Hyderabad.
Counsel for the petitioner.

ఎర్రజెండాదే భవిష్యత్తు..

- తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపిని రానివ్వం
- న్యాయం కోసం నిలబడాలి.. అన్యాయంపై ప్రశ్నించాలి
- ప్రజలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పిలుపు

సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల సమస్యల కోసం నిలబడి, కొట్లాడి విజయాలు సాధించి.. న్యాయానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచేది కమ్యూనిస్టులేనని, భవిష్యత్తు ఎర్రజెండాదే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం అమ్మపేట గ్రామంలో శనివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. రాజకీయాలంటే డబ్బు, అధికారం, ఓట్లు, సీట్లు కావన్నారు. ప్రజల పక్షాన న్యాయం కోసం నిలబడి అన్యాయం జరిగితే ప్రశ్నించడమే కమ్యూనిస్టు సిద్ధాంతమన్నారు. ప్రాంతీయ పార్టీలు ఒక ప్రాంతానికే పరిమితమై ఉంటాయన్నారు. సిపిఎం, ఎర్రజెండా విశ్వవ్యాప్తమని, భూమి ఉన్నంతవరకు ఉంటాయని తెలిపారు. వ్యవసాయం చేసే రైతుకు ఒక సంవత్సరం కలిసి రానంత మాత్రాన సాగు మానుకోలేడని, అలాగే సిపిఎంకి తాత్కాలికంగా ఒడిదుడుకులు వచ్చినా భవిష్యత్తులో ప్రజలకు దిక్సూచి, ప్రత్యామ్నాయం ఎర్రజెండేనని చెప్పారు. కేరళ రాష్ట్రంలో ఆదర్శవంతమైన ప్రజాపాలన సాగుతోందన్నారు. రైతుల ధాన్యానికి అత్యధిక మద్దతు ధర ఇస్తుందన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి కరోనాను కట్టడి చేసి ప్రజా ఆరోగ్యాలను కాపాడటంలో కేరళ రాష్ట్రం అగ్రభాగాన నిలిచిందని గుర్తు చేశారు.

తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపి రాకుండా చేయడమే సిపిఎం లక్ష్యమన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ శక్తుల సిద్ధాంతాన్ని దేశంలో బిజెపి ప్రభుత్వం అమలు చేసి ప్రజలపై దాడులు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతోన్మాద సిద్ధాంతాన్ని, మనువాదాన్ని మట్టిలో కలుపుతామన్నారు. అమ్మపేట, బాణాపురం, ముదిగొండ ప్రాంతాల్లో వందలాది కూలి, వర్గ పోరాటాలను నిర్మించిన చరిత్ర సిపిఎందేనన్నారు. అమరవీరుల కోయ బాబు, గండ్లూరి, గంద్ర వీరభద్రారెడ్డి, బాజీ హనుమంతు వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు.

బిజెపి ఫాసిస్టు విధానాలతో దేశ ప్రజలు కుదేలవుతున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని అమలు చేసి దేశాన్ని నాశనం చేయటానికి యత్నిస్తున్నారని చెప్పారు. ఈ కుట్రలను తిప్పుకొట్టేందుకు దేశభక్తులు, లౌకికవాద పార్టీలు ముందుకు రావాలన్నారు. అనంతరం అమ్మపేట, బాణాపురం గ్రామాలకు చెందిన 24 కుటుంబాలు సిపిఎం సీనియర్ నాయకులు ఊటుకూరి గోపయ్య, మేకపోతుల వెంకన్న ఆధ్వర్యంలో తమ్మినేని సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బండి రమేష్, నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

హత్యా?.. ప్రమాదమా..?

- మందమర్రిలో ఆరుగురి సజీవ దహనం
- అర్ధరాత్రి ఇంటికి నిప్పంటుకున్న వైనం
- చుట్టపు చూపుగా వచ్చిన తల్లీపిల్లలు మృతి
- వివాహేతర సంబంధమే కారణమని అనుమానాలు
- ఇంటి సమీపంలో పెట్రోల్ డబ్బాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం గుడిపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఘోరం జరిగింది. ఇంటికి నిప్పంటుకొని నలుగురు వ్యక్తులతో సహా ఇద్దరు చిన్నారులు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి గ్రామంలో మాసు శివయ్య, భార్య పద్మ దంపతులు నివాసముంటున్నారు. వారి ఇంటికి పద్మ సోదరి కుమార్తె, ఇద్దరు పిల్లలు చుట్టపుచూపుగా వచ్చారు. అలాగే, సింగరేణి గనిలో పని చేస్తున్న శనిగరపు శాంతయ్య వీరితోపాటే ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి నిప్పంటించారు. మంటలు ఇల్లంతా వ్యాపించి శివయ్య(50), ఆయన భార్య పద్మ (45), పద్మ అక్క కూతురు మౌనిక (33), మౌనిక ఇద్దరు కుమార్తెలు హిమబిందు (4), స్వీటీ(2), సమీప బంధువు శాంతయ్య(50) సజీవ దహనమయ్యారు. ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాంతయ్య కొంతకాలంగా పద్మతో వివాహేతర సంబంధం కలిగి ఉండటంతో వారింట్లోనే ఉంటున్నాడని సమాచారం. ఈ విషయంలోనే శాంతయ్య కొడుకులు గొడవ పడి ఈ ఘతుకానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి ఎవరూ బయటకు రాకుండా గడియ పెట్టి నిప్పంటించి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాంతయ్య ఆస్తిలో వాటా కావాలని పద్మ కోర్టుకు సైతం వెళ్లిందని బంధువులు పేర్కొంటున్నారు.

15 రోజుల కిందట హత్యాయత్నం!

వివాహేతర సంబంధం విషయంలో శాంతయ్యను కుటుంబ సభ్యులు నిలదీశారు. శాంతయ్య భార్య ఆయన పనిచేస్తున్న గని వద్దకెళ్లి గొడవ చేసింది. శాంతయ్యపై ఇటీవల హత్యాప్రయత్నం చేయగా తప్పించుకున్నట్టు సమాచారం. ఈ గొడవల నేపథ్యంలో అగ్ని ప్రమాద ఘటన విషయంలో పోలీసులు శాంతయ్య కుటుంబ సభ్యులను అనుమానిస్తున్నారు. పద్మపై సైతం దాడి చేసినట్టు గ్రామస్తులు తెలిపారు.

ఉద్యోగం, పొలాల గొడవలే కారణమా..?

సింగరేణిలో ఉద్యోగిగా పనిచేస్తున్న శాంతయ్య రెండేండ్లలో రిటైర్ కానున్నారు. ఆ ఉద్యోగం పద్మ సంబంధీకులకు ఇస్తారని శాంతయ్య కొడుకు భావించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారు శాంతయ్యను నిలదీసినట్టు తెలుస్తోంది. శాంతయ్య స్వస్థలమైన లక్షెట్టిపేట మండలం ఊత్కూరులో పొలాలు ఉన్నాయి. అవి చేజారిపోకుండా ఉండేందుకు తమ పేరిట రాయాలని గొడవ పడినట్టు సమాచారం.

చుట్టపు చూపుగా వచ్చి తల్లీపిల్లలు మృతి

కోటపల్లి మండలం కొండంపేట గ్రామానికి చెందిన మౌనిక భర్త గతేడాది కరోనాతో మృతి చెందాడు. ఆమెకు తల్లిదండ్రులు లేకపోవడంతో కొండంపేటలో నానమ్మ గడ్డం పోసక్క, అన్నయ్య ప్రశాంత్‌తో కలిసి ఉంటుంది. తన సోదరి అయిన పద్మ ఇంటికి తరచూ వచ్చి వెళ్తుండేది. మౌనిక రెండో రోజుల క్రితమే తన పిల్లలతో కలసి పద్మ ఇంటికి వచ్చింది. ఈ క్రమంలోనే తల్లీపిల్లలు అగ్నిప్రమాదంలో సజీవ దహనమయ్యారు. సంఘటనా స్థలాన్ని డిసిపి అఖిల్ మహాజన్, మంచిర్యాల ఎసిపి తిరుపతిరెడ్డి, జైపూర్ ఎసిపి నరేందర్ పరిశీలించారు. అనంతరం డిసిపి మాట్లాడుతూ.. 16 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నామని, ఫోరెన్సిక్, అగ్నిమాపక, ఎలక్ట్రికల్ తదితర డిపార్ట్‌మెంట్ల అధికారులు వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రమాద ఘటనపై పూర్తి నివేదిక వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని, దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు. మృతుడు శాంతయ్యకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. శివయ్య-పద్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బస్వాపురం భూనిర్వాసితుల నిరసన

- సర్వే పనుల అడ్డగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపూర్ రిజర్వాయర్లో ముంపునకు గురవుతున్న బిఎన్ తిమ్మాపురం గ్రామస్తులు.. శనివారం సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. రిజర్వాయర్ కట్ట పనులు ఎంతవరకు పూర్తయ్యాయని సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బస్వాపురం రిజర్వాయర్ వద్ద భూ నిర్వాసితులు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరుకుంది. పట్టా, కబ్జా భూములకు నస్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజి చెల్లించి, తమకు ప్లాట్లను కేటాయించి ఇల్లు నిర్మించుకోవడానికి అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు దొంకేన ప్రభాకర్ రావుల నందు వళ్ళందాస్ పరమేష్ దొంకేన విమలాకర్, జిన్న శ్రీశైలం, పిన్నెం ధనరాజ్, జిన్న నర్సింహ, కుచుల భిక్షపతి, పిన్నాం దశరథ తదితరులు పాల్గొన్నారు.

నోరూరించిన కర్ణాటక ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రకరకాల వంటలు... పలురకాల రుచులు...కర్ణాటక వంటలతో ఆ ప్రాంగణం నిండిపోయింది. కర్ణాటక శిక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ కాచిగూడలోని నృపతుంగా స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కర్ణాటక ఫుడ్ ఫెస్టివల్‌కు ప్రజలు వేలాది మందిగా తరలివచ్చారు. 96 ఏండ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్న కర్ణాటక శిక్షణ సమితి తొలిసారిగా ఈ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో బిసిబెలాబాత్ నుంచి నీరు దోశ వరకు అన్ని రకాల వంటలు, పాపుల్ ఫుడ్ ఐటమ్స్, దర్వాడా పేడతో స్టాల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. మొత్తం 104 స్టాల్స్ ఏర్పాటు చేయగా ప్రతి స్టాల్ ఆహార ప్రియులతో రద్దీగా మారింది.

వాణిజ్య పన్నుల విధానంలో గణనీయ మార్పు

- సిఎస్ సోమేశ్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న సిఎస్ సోమేశ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వాణిజ్య పన్నుల విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందనీ, వ్యవస్థీకృత ఆధారిత పన్ను అమలుపై దృష్టి సారించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలిపారు. అస్సాం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో బిఆర్‌కెఆర్ భవన్‌లో భేటీ అయ్యారు. శాఖాపరంగా పలు యాప్‌లు, మాడ్యూల్స్‌ను అభివృద్ధి చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. అన్ని నోటీసులు, ప్రొసీడింగ్‌ల జారీ మాన్యువల్‌గా ఇవ్వడం తొలగించామని అన్నారు. వ్యక్తిగత టార్గెట్‌లు, విధుల ఆధారిత లక్ష్యాలతో ఈ యాప్‌లు ఉన్నాయని వివరించారు. కొత్తగా అనేక సర్కిళ్లను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర కమర్షియల్ టాక్స్ శాఖను పునర్వ్యవస్థీకరించామనీ, పరిశోధన, విశ్లేషణల కోసం ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. అస్సాం రాష్ట్రంలో ఇప్పటికీ సంప్రదాయ పద్ధతి ద్వారానే శాఖాపరమైన కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నామని వారు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి తమ రాష్ట్రంలో కూడా అమలు చేయనున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూ ప్రసాద్, అదనపు కమిషనర్లు సాయి కిషోర్, అస్సాం కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ బాసుమతరీ పులేశ్వర్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ఎస్‌బిఐ ప్రాపర్టీ షో షురూ

హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ అయినా ఎస్‌బిఐ హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ప్రాపర్టీ షోనూ ఏర్పాటు చేసింది. శనివారం ఈ ప్రదర్శనను ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం) అమిత్ జింగ్రాన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజులపాటు సాగనున్న ఈ ప్రదర్శనలో 70 మంది పెద్ద బిల్డర్లు తమ 300 పైగా ప్రాపర్టీలను ప్రదర్శనకు ఉంచారని ఎస్‌బిఐ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని కొనుగోలుదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ప్రాపర్టీ షోలో నివాసాలను కొనుగోలు చేసే వారికి రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును మినహాయించ నున్నట్లు జింగ్రాన్ తెలిపారు. ఇతర బ్యాంక్‌లతో పోల్చితే తాము చౌక రుణాలను ఆఫర్ చేస్తున్నామన్నారు.

విద్యావ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న బిజెపి

- కేంద్ర బడ్జెట్‌లో పదిశాతం నిధులు కేటాయించాలి
- ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమం
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడమే తమ లక్ష్యమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత అధ్యక్షులు విపి సాను చెప్పారు. విద్యారంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే నూతన విద్యావిధానాన్ని తెచ్చిందన్నారు. ఈ మహాసభ నిర్వహణ కోసం సహకరించిన వారందరికీ ఆయన ధన్యవాదాలు చెప్పారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఉన్న ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం నుంచి నిర్వహించిన ఎస్ఎఫ్ఐ అఖిల భారత 17వ మహాసభ శుక్రవారం ముగిసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విపి సాను మాట్లాడుతూ... 83 మందితో కేంద్రకమిటీ, 19 మందితో కార్యదర్శివర్గం ఏర్పడిందని వివరించారు. విద్యారంగం, విద్యార్థుల సమస్యలు, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇతర అంశాలకు సంబంధించి 36 తీర్మానాలను మహాసభ ఆమోదించిందని వివరించారు. విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామిక హక్కులు, ప్రభుత్వ నిర్బంధంపై చర్చించామని అన్నారు. మేధావులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులతో సంప్రదించి ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ఆమోదించామని చెప్పారు. విద్యార్థులందరూ చదువుకోవాలంటే ప్రభుత్వ విద్యాసంస్థలు మరిన్ని కావాలని అన్నారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం జిడిపిలో ఆరు శాతం, కేంద్ర బడ్జెట్‌లో పది శాతం కేటాయించాలన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిడిపిలో 2.8 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని చెప్పారు. కనీసం ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యలో 45 శాతం డ్రాపౌట్ రేటు ఉందన్నారు.

వారిలో ఎస్సి, ఎస్టి, ఒబిసి, మైనార్టీలే ఎక్కువ మంది ఉంటారని వివరించారు. వంద శాతం విద్యార్థులకు బడులకు వెళ్లడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకోవైపు ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమితో ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలతో ఉన్నాయని అన్నారు. దీంతో ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరుతున్నారని చెప్పారు. వాటిలో ఫీజుల భారం ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు విద్యావ్యాపారాన్ని మోడీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఎన్ఈపీ ద్వారా విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేసేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. మౌలానా ఆజాద్ ఫెలోషిప్‌లు, విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఖండించారు. వాటిని పునరుద్ధరించి విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులకు నైపుణ్యం పెంచాలనీ, పరిశోధనలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగం, విద్యార్థుల సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాలను కలుపుకుని ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ.. ఓయూలో ..ఈ మహాసభ నిర్వహించడం చారిత్రాత్మకమని అన్నారు. ఇందుకు అవకాశం కల్పించిన ఓయూ పరిపాలనా సిబ్బంది, వీసీ, రిజిస్ట్రార్, మహాసభ విజయవంతం కోసం సహకరించిన ఆహ్వానసంఘం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఘంటా చక్రపాణి, ఆర్ లింబాద్రి, కె నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, కళాకారులు, మీడియా, ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి, నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ అభరణాల విక్రయ రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తన సోమాజిగూడ షోరూంలో "అర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెల్లరీ షో" ప్రదర్శనను ఏర్పాటు చేసింది. శనివారం దీన్ని ఆ సంస్థ ప్రతినిధుల సమక్షంలో ఇండియన్ సినిమా ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి, నటీ ఆనంద్ వాసుకి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 25 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.113/2021
In O.S No.10/2017

బిట్వీన్:
పిటీషనరు /వాది:
గొల్లపల్లి ఉషారాణి (Died) and others
రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
తిప్పాబొట్ల అన్నపూర్ణ and others
5వ రెస్పాండెంటు అడ్రసు:
Sridhara Durga Prasad, S/o. Sri Rama Murthy, Hindu, aged 48 years, C/o. Sri Sridhara Srinivas, C/o Archeological Department, Gum Foundry, Hyderabad, Telangana State.

పై నెంబరు పిటిషను I.A.No. 113/2021 in O.S.No.10/2017 దావాలో 5వ రెస్పాండెంటు /5వ ప్రతివాది తమ కోర్ట్ వారు ఉత్తర్వులు ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు, మరియు నోటీసులు రిజిస్టర్ పోస్ట్ ద్వారా తమ కోర్ట్ ద్వారా పంపించినను తీసుకొనక Avoid చేయుచున్నారు. పై నెంబర్ దావా ది.20-12-2022 సు॥రం తేదీన వాయిదా అయివున్నది. **సదరు తేదీన ది.20-12-2022 నాడు ఉదయం 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేదా ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై సంజాయిషి తెలుప గలరు.** కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ చేయడమైనది.

ఎస్.కే.రోషన్
భీమవరం, అడ్వకేట్, భీమవరం.
16-12-22. సెల్: 94417 50986

In the Court of the IV Addl. District Judge : Nellore
I.A.No. 68 / 2021
O.S.No. 29 / 2020

1. **Degapudi Gnana Prasuna**
2. **Vaka Venkata Vinni**
- Petitioners / Plaintiffs
Vs
1. **Degapudi Vamsi Krishna**
2. **Patchipala Phani Kumar Reddy**
3. **Punati Srikanth Reddy**
- Respondents / Defendants
4. **Punati Suman Reddy**
5. **Ponnamneni Dayakar Rao**
6. **Sri Sai Gokul Ananda Developers,** Rep. by its Partner **Cherukuru Khadar Valli,**
7. **Sub-Registrar,** Bukkapatnam, Ananthapuram District.
- Proposed Parties R4 to R7 / Respondents

Notice
To,
R5. Ponnamneni Dayakar Rao, S/o **Varada Rajeswara Rao,** resident of Door No.6-1-103/65, Abhinav Nagar Colony, Padma Rao Nagar, Secunderabad, Telangana.

పై నెంబరున పిటిషనర్లు / వాదులు పై దావాలో మిమ్మల్ని ప్రపోజ్డ్ పార్టీస్‌గా(4నుండి 7 ప్రతివాదులుగా) చేర్చ మని కోరుతూ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే30-12-2022ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం**10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపి న కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడలకేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం. అజయ్ బాబు
చుండూరి శ్రీహరి నారాయణ రావు
పిటిషనర్లు తరపు అడ్వకేట్స్, ఒంగోలు, నెల్లూరు.

In the Court of the IV Addl. District Judge : Nellore
I.A.No. 70 / 2021
I.A.No. 297 / 2020
O.S.No. 29 / 2020

1. **Degapudi Gnana Prasuna**
2. **Vaka Venkata Vinni**
- Petitioners / Petitioners / Plaintiffs
Vs
1. **Degapudi Vamsi Krishna**
2. **Patchipala Phani Kumar Reddy**
3. **Punati Srikanth Reddy**
- Respondents / Respondents / Defendants
4. **Punati Suman Reddy**
5. **Ponnamneni Dayakar Rao**
6. **Sri Sai Gokul Ananda Developers,** Rep. by its Partner **Cherukuru Khadar Valli,**
7. **Sub-Registrar,** Bukkapatnam, Ananthapuram District.
- Proposed Parties R4 to R7 / Respondents

Notice
To,
R5. Ponnamneni Dayakar Rao, S/o **Varada Rajeswara Rao,** resident of Door No.6-1-103/65, Abhinav Nagar Colony, Padma Rao Nagar, Secunderabad, Telangana.

పై నెంబరున పిటిషనర్లు / వాదులు పై I.A.No. 297 /2020 అను పిటిషన్‌లో మిమ్మల్ని ప్రపోజ్డ్ పార్టీస్ గా (4నుండి 7 రెస్పాండెంట్లుగా) చేర్చ మని కోరుతూ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే30-12-2022 ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం**10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపి న కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడలకేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం. అజయ్ బాబు
చుండూరి శ్రీహరి నారాయణ రావు
పిటిషనర్లు తరపు అడ్వకేట్స్, ఒంగోలు, నెల్లూరు.

In the Court of the IV Addl. District Judge : Nellore
I.A.No. 69 / 2021
I.A.No. 296 / 2020
O.S.No. 29 / 2020

1. **Degapudi Gnana Prasuna**
2. **Vaka Venkata Vinni**
- Petitioners / Petitioners / Plaintiffs
Vs
1. **Degapudi Vamsi Krishna**
2. **Patchipala Phani Kumar Reddy**
3. **Punati Srikanth Reddy**
- Respondents / Respondents / Defendants
4. **Punati Suman Reddy**
5. **Ponnamneni Dayakar Rao**
6. **Sri Sai Gokul Ananda Developers,** Rep. by its Partner **Cherukuru Khadar Valli,**
7. **Sub-Registrar,** Bukkapatnam, Ananthapuram District.
- Proposed Parties R4 to R7 / Respondents

Notice
To,
R5. Ponnamneni Dayakar Rao, S/o **Varada Rajeswara Rao,** resident of Door No.6-1-103/65, Abhinav Nagar Colony, Padma Rao Nagar, Secunderabad, Telangana.

పై నెంబరున పిటిషనర్లు / వాదులు పై I.A.No. 296 /2020 అను పిటిషన్‌లో మిమ్మల్ని ప్రపోజ్డ్ పార్టీస్ గా (4నుండి 7 రెస్పాండెంట్లుగా) చేర్చ మని కోరుతూ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే30-12-2022 ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం**10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపి న కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడలకేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం. అజయ్ బాబు
చుండూరి శ్రీహరి నారాయణ రావు
పిటిషనర్లు తరపు అడ్వకేట్స్, ఒంగోలు, నెల్లూరు.

త్వరలో మరో పది ప్రీమియం కంట్రీ చికెన్ స్టోర్లు

హైదరాబాద్: అత్యంత ప్రీమియం కంట్రీ చికెన్ బ్రాండ్ అయిన కంట్రీ చికెన్ కో హైదరాబాద్‌లో తన నాలుగో అవుట్‌లెట్‌ను తెరిచింది. శనివారం దీన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటి ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఎంఎల్ఎ టి.ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావు, కంట్రీ చికెన్ కో సిఇఒ జి.సాయికేష్ గౌడ్, సిఒఒ మహ్మద్ సమీ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే రూ.649 ప్రారంభ ధరతో మ్యారినేట్ చేసిన దేశీయ కోడి మాంసం, చికెన్ ఊరగాయలను కూడా త్వరలో ప్రవేశపెట్టనున్నామని సాయికేష్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రగతినగర్, నిజాంపేట్, కెపిహెచ్‌బి, కొత్తపేట్, దిల్‌సుఖ్‌నగర్, మణికొండలలో ఇప్పటికే ఉన్న తమ స్టోర్‌లతోపాటు నగరంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నామని, త్వరలో మరో పది ప్రీమియం స్టోర్‌లను తెరవడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

ఆయుష్ కార్యదర్శితో మంత్రి హరీశ్‌రావు భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కేంద్ర ఆయుష్ శాఖ కార్యదర్శి రాజేష్ కొటేచా శనివారం వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీష్‌రావుతో సమావేశమయ్యారు. బి.ఆర్.కె.ఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆయుష్ కార్యక్రమాలపై కేంద్ర కార్యదర్శి రాజేష్ కొటేచాకు హరీష్‌రావు వివరించారు. ఈ సందర్భంగా రాజేష్ కోటేచాను మంత్రి ఘనంగా సన్మానించారు.

'స్వాతి సంస్థ' సేవ అభినందనీయం

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పార్థసారథి

ప్రజాశక్తి - కల్చరల్
సమాజంలో అనాథలను, వికలాంగులను ఆదుకునే సంస్థలు కొన్ని మాత్రమే ఉన్నాయని అందులో స్వాతి సంస్థ ముందు వరుసలో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధి కారి సి.పార్థసారథి అభినందించారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై స్వాతి ఆర్ట్స్ క్రియేషన్స్ నిర్వహణలో ప్రతిభావంత టెలివిజన్ మాధ్యమ కళాకారులకు సిల్వర్ స్క్రీన్ పురస్కారాల ప్రదానోత్సవంతో పాటు ఇరవై మంది వికలాంగులకు ఒకొక్కరికి రూ. ఐదు వేలు నగదు బహుకరుణ వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా పార్థసారథి పాల్గొని.. శతమానం భవతి సీరియల్ కళాకారులకు, హిజ్రాల సంఘం నాయకులు ఆలేఖ్యలతో పాటు సీనియర్ నటి నీలిమ నాయుడు, కథానాయకుడుగా నారారోహిత్‌కు పురస్కారాలు బహుకరించి మాట్లాడారు. అధ్యక్షత వహించిన సీరియల్స్ దర్శక, నిర్మాత నాగబాల సురేష్ కుమార్ మాట్లాడుతూ.. గత 22 ఏళ్ళ గా కళా కారులను గిరిరాజ్ ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. పోలీస్ ఉన్నతాధికారి రామదాసు, సాంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

జువైనల్ హోమ్‌లో ఆర్చరీ విద్య

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జువైనల్ హోమ్‌లో ఆర్చరీ విద్య (విలు విద్య) శిక్షణనిస్తున్నట్టు మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాజుల రామారంలోని జువైనల్ స్పెషల్ హోమ్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ రిటైల్ అవుట్‌లెట్‌కు, కొత్త అదనపు భవన సముదాయం నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తెలంగాణ జువైనల్ ఆర్చరీ అకాడమిని ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలోని మోడల్ న్యూట్రి గార్డెన్‌ను మంత్రి ప్రారంభించి, పలు రకాల పూలు, పళ్ళ మొక్కలను నాటారు. ఆర్చరీ అకాడమీని ప్రారంభించిన మంత్రి విద్యార్థులతో కలసి దనస్సును సంధించి ఉత్తేజపరిచారు. ఆ తర్వాత మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు మానసికంగా కృంగిపోకుండా, పలు శిక్షణలు ఇచ్చి ఉపాధిని పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. నేషనల్ కోచ్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. వారి ఆసక్తిని గుర్తించి హ్యాండ్ మేడ్ వస్తువులు, చేనేత దుస్తుల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవిస్తున్న వారిని నేరస్తులుగా పరిగణించకుండా వారిలో మార్పులు తెచ్చేందుకు పెట్రోల్ బంక్ నిర్వహిస్తూ రాష్ట్ర జైళ్ల శాఖ, ఖైదీలను భాగస్వామ్యం చేస్తున్నదనీ, వారికి జీవనోపాధి కల్పిస్తూ వారి కుటుంబాలను పోషించుకునే అవకాశం కల్పిస్తున్నదన్నారు.

దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం

జాతీయ దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. వాటిని జేబు సంస్థలుగా మార్చుకుని బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. 75 ఏండ్ల కాలంలో ఈడీ, సిబిఐ, ఐటి దాడులు 5వేలకుపైగా చిలుక ఉంటే, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ఎనిమిదేండ్లలో 25 వేలకు పైగా నమోదయ్యాయని తెలిపారు. బిజెపి రౌడీయిజం ,మోడీ ఈడీయిజం తెలంగాణలో నడవదని హెచ్చరించారు.

గీ బువ్వ తినేదెట్టా..!

- బుక్క బుక్కకూ మట్టిపెళ్లలు
- నీళ్ల చారు, గంజి మెతుకులు
- రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి పాఠశాలలో పరిస్థితి
- ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
'బుక్క బుక్కకూ మట్టిపెళ్లలు.. మెత్తటి ముద్దల బువ్వ.. నీళ్ల చారు, గంజి మెతుకులు.. ఇలా ఉంటే అన్నం తినేదెట్టా..? వారంలో ఒక రోజు కూరగాయలు తప్ప ప్రతి రోజూ పప్పుచారే పెడుతారు. హెచ్‌ఎం సార్‌కు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. తింటే తినండి లేదంటే ఊకోండని అంటున్నారు. ఇది తినలేక ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నాం. తాగడానికి నీళ్లు కూడా ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం.' అని శివరాంపల్లి హైస్కూల్ విద్యార్థులు తమ గోడును వెలిబుచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంది. పాఠశాలల్లో మధ్నాహ్న భోజనంపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2,367 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. రెండు లక్షల 70 వేల 381 మంది విద్యార్థులు ఉన్నారు. రంగారెడ్డిలో 1,309 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, లక్ష 76 వేల 461 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 1,276 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి లక్ష 53 వేల 957 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వికారాబాద్‌లో 1,058 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 91,970 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇందుకుగాను నెలకు సుమారు రూ.కోటి 80 లక్షలు ఖర్చు చేస్తున్నారు. చెప్పుకోవడానికి లెక్కలు బాగానే ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో విద్యార్థులు వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. స్కూల్లో పెట్టే మధ్యాహ్న భోజనం తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగునంగా మెస్ చార్జీలు పెంచకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహణ కష్టంగా మారుతోంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో నాణ్యత లోపించడంతో అన్నం ముద్దలు ముద్దలు అవుతోంది. స్కూళ్లకు సన్నబియ్యం సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. అమలులో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. పాలిష్ బియ్యం సరఫరా చేయడంతో అన్నం వండితే ముద్దలు అవుతోంది. మరోవైపు ముద్ద ముద్దకు మట్టిపెళ్లాలు రావడంతో విద్యార్థులు తినలేకపోతున్నారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి హైస్కూల్‌ను పరిశీలిస్తే.. విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. 6 నుంచి 10వ తరగతులకుగాను 1200 మంది విద్యార్థులు ఉన్నారు. 300 మంది మాత్రమే మధ్నాహ్న భోజనం తింటున్నారు. మిగతా 900 మంది ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. దీనికి కారణం లేకపోలేదు.. 'రోజూ నీళ్ల చారు.. దొడ్డు బియ్యం బువ్వ.. బుక్క బుక్కకు మట్టిపెళ్లల్లు వస్తుంటే.. తినేది ఎట్టా..?' అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. అది తినలేక ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నామని తెలిపారు. మరోవైపు సౌకర్యాలు లేక చెట్ల కిందనే కూర్చొని తింటున్నారు. భోజన సమయంలో తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి ఉంది. విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్న వాటర్ బాటిల్‌నే సాయంత్రం వరకు సరిపెట్టుకుంటున్నారు. అయితే, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడం, మధ్నాహ్న భోజన కార్మికులకు సరిపడా నిధులు ఇవ్వకపోవడంతోనే ఉన్నదాంట్లో నిర్వాహకులు పెడుతున్నారు. మెనూ అమలు చేయలేకపోతున్నారు. వారంలో మూడు రోజులు గుడ్డు పెట్టాల్సి ఉంది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.7 ఉండగా ప్రభుత్వం ఇచ్చేది మాత్రం రూ.5. దీంతో వారంలో రెండు రోజులు మాత్రమే విద్యార్థులకు గుడ్డు పెడుతున్నారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులు ఇచ్చి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

మెనూ ప్రకారం భోజనం పెట్టేందుకు కృషి చేస్తాం
సుశీందర్ రావు- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి

నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. నిత్యావసర ధరలు పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ వెసులుబాటు చేసుకుని నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీల ప్రకారం భోజనం తయారు చేయడం కష్టంగా ఉందని మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మెస్ చార్జీలు పెంచాల్సి ఉంది.

బిసిలపై కపట ప్రేమ

- రాజకీయ చైతన్య పర్యటనకు శ్రీకారం
- బిసి రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గడిచిన డెబ్బై ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ హయాంలో బిసిలు నష్టపోయారని బిసి రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని మురళీధర్‌రావు కమిషన్ సూచనల మేరకు నాటి ప్రభుత్వం స్థానిక సంస్థలకు బిసి రిజర్వేషన్‌లు 44 శాతనికి పెంచాయని గుర్తు చేశారు. శాస్త్రీయమైన నివేదిక లేదన్న కారణంతో తిరిగి బిసి రిజర్వేషన్‌లను 34 శాతానికి కుదించగా సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 52 శాతనికి ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. బిసి కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు ఎనిమిదేండ్లుగా పాలక మండళ్లు లేకుండా చేశారని తెలిపారు. సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఐదు లక్షల డెబ్బై ఆరు వేల మంది బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిసి సంక్షేమ హాస్టళ్లలో మూడేండ్లుగా ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారని ఆరోపించారు.

తెలంగాణ హృదయాన్ని
'మాండవీయ' గాయపర్చారు

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బల్క్ డ్రగ్స్ పార్కుని ఎపికి ఇచ్చినట్లు రాతపూర్వకంగా.. తెలంగాణకు కేటాయించినట్లు మౌఖికంగా.. కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రి మన్ సుఖ్ మాండవీయ లోక్‌సభలో చేసిన ప్రకటనపై ట్విటర్ వేదికగా మంత్రి కెటిఆర్ మండిపడ్డారు. "మన్ సుఖ్ మాండవీయ పెద్ద అబద్ధంతో తెలంగాణ హృదయాన్ని గాయపరిచారు. భారతదేశ లైఫ్ సైన్సెస్ హబ్‌కు బల్క్ డ్రగ్ పార్కు ఇవ్వకుండా దేశానికి తీరని అన్యాయం చేశారు. జాతి ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే బిజెపి ప్రాధాన్యం ఇస్తుంది.

కేంద్ర మంత్రి అబద్ధాలతో పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారు. ఆయనపై లోక్‌భలో హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతున్నా. తప్పుదోవ పట్టించినందుకు కేంద్రమంత్రి మాండవీయ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి" అని కెటిఆర్ డిమాండ్ చేశారు.

లోక్‌సభలో మాండవీయ ఏమన్నారంటే?

టిఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్పందిస్తూ... "దేశంలో మూడు బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయాలని, ఒక్కోదానిపై రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించాం. ఇందుకు కొన్ని కొలమానాలు పెట్టి రాష్ట్రాల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాం. ఇప్పటి వరకు 13 రాష్ట్రాల నుంచి రాగా వాటిని పరిశీలించాం. హైదరాబాద్ ఫార్మా పరిశ్రమకు ముఖ్యమైన ప్రాంతమని సభ్యుడు చెప్పారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పార్కు ఏర్పాటు కోసం తెలంగాణ ప్రభుత్వం పంపిన దరఖాస్తును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు రూ.వెయ్యి కోట్లు లభిస్తుంది. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌ల్లోనూ ఈ పార్కు ఏర్పాటుకు కేంద్రం ఆమోదించింది. ఇప్పటికే వాటికి ప్రాథమికంగా రూ.300 కోట్ల చొప్పున ఇచ్చాం" అని చెప్పారు. అయితే సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మాత్రం ఆయన ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌ల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆమోదించినట్లు వెల్లడించారు.

'పిడిఎస్' సేవలకు జిఎస్‌టి నుంచి మినహాయింపునివ్వండి..

- బిడి ఆకుపై పన్నుకు మేం వ్యతిరేకం
- జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) సంబంధిత సేవలైన కస్టమ్స్ మిల్లింగ్, ట్రాన్స్‌పోర్టు సేవలకు జిఎస్‌టి నుంచి మినహాయింపునివ్వాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు అందించే ఈ సేవలపై జిఎస్‌టి విధించటం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతోందని తెలిపారు. అందువల్ల ఆయా సేవలకు జిఎస్‌టి సేవల నుంచి మినహాయింపునివ్వాలని విజ్ఞప్తి చేశారు. జిఎస్‌టి 48వ కౌన్సిల్ మీటింగ్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం ఢిల్లీలో నిర్వహించారు. హైదరాబాద్ బిఆర్‌కె భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా హరీశ్‌రావు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. తెలంగాణలో మైనర్ ఇరిగేషన్ కింద 46 వేల జలాశయాలు ఉన్నాయనీ, వీటి ద్వారా 25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ప్రతీ ఏడాది నీటి నిర్వహణ చేయడం ఎంతో ముఖ్యమని వివరించారు. తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆ నిర్వహణను చేపడుతోందనీ, దాంతోపాటు మరమ్మతు పనులను జిఎస్‌టి నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. బీడీ ఆకుపై పన్ను విధించడాన్ని తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని చెప్పారు. గిరిజన, పేద, మారుమూల ప్రాంతాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు బీడీలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఇప్పటికే కేంద్రం బీడీలపై 28 శాతం జిఎస్‌టిని విధించిందని, దాన్ని తమ ప్రభుత్వం వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఇప్పుడు ముడి సరుకు అయిన ఆకులపై కూడా 18 శాతం జిఎస్‌టి విధిస్తే పేదలు, గిరిజనుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఆకులపై పన్నుకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ట్యాక్స్ ఇన్ వాయిస్ రూల్స్ సవరణ ప్రపోజల్‌ను స్వాగతిస్తున్నామని హరీశ్ ఈ సందర్భంగా తెలిపారు. దానిపై ఉన్న సంశయాలను నివృత్తి చేయాలంటూ కౌన్సిల్‌ను కోరారు. టెలికాం సేవలకు సంబంధించి ట్రాయ్ నియమ నిబంధనల వల్ల కస్టమర్ అడ్రస్, పిన్ నెంబర్ పేటిఎం, మోబి క్విక్, బిల్ డెస్క్ తదితరాలు ఆన్‌లైన్ వ్యాపార సంస్థల వద్ద ఉండే అవకాశం లేదని తెలిపారు. దీంతో వినియోగదారులున్న రాష్ట్రాల ఆదాయం ఇతర రాష్ట్రాలకు వెళుతుందని వివరించారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనల్లో సవరణలు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వీడియో కాన్ఫరెన్సులో సిఎస్ సోమేశ్ కుమార్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

నిమ్స్‌లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్

- మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నిమ్స్‌లోనే చాలా వరకు కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్‌లు జరుగుతున్నాయని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో దాదాపు రూ.రెండు కోట్లతో సమకూర్చుకున్న ఇంట్రా ఆపరేటివ్ ఆల్ట్రా సౌండ్, ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్, ఆల్ట్రా సోనిక్ ఆస్పిరేట్ వైద్య పరికరాలను ట్రామా బ్లాక్ (ఈఎండీ) అత్యవసర విభాగంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ సత్యనారాయణతో కలిసి శనివారం మంత్రి ప్రారంభించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా వాస్క్యులర్ సర్జరీ సింపోసియం నిర్వహించడం గొప్ప విషయమని మంత్రి అన్నారు.

నిమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. డిస్పెన్సరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఎంబిబిఎస్ సీట్లు నాలుగింతలు పెంచామని.. పీజీ సీట్లు రెండింతలు చేశామన్నారు. నెలకు మూడు, నాలుగు ఎయిర్ అంబులెన్స్‌లు ఇక్కడికి వస్తున్నాయని తెలిపారు. అత్యధిక ట్రాన్స్‌ప్లాంట్ జరిగేది హైదరాబాద్‌లోనే అన్నారు. పేదల వైద్యం కోసం ఆరోగ్య శ్రీ కింద రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అనవసర పరీక్షలు చేయొద్దని, అనవసర మందులు వద్దని.. ప్రజలపై భారం మోపొద్దని వైద్యులకు సూచించారు. అవయవదానం కోసం అందరూ కలిసి పనిచేయాలన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో సింగిల్ యూజ్ ఫిల్టర్ డయాలసిస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చి.. దేశంలోనే తెలంగాణ తొలి రాష్ట్రంగా నిలిచిందన్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న వారికి బస్ పాస్, పింఛన్లు, మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. డయాలసిస్‌కు ప్రభుత్వం ఏటా రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. అత్యాధునిక వైద్య పరికరాల కోసం రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి రోగాలను నివారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ గంగాధర్, వైద్య బృందం హెచ్‌ఓడీ, న్యూరాలజీ వైద్య బృందం, వాస్క్యులర్ వైద్య బృందం, జూనియర్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నర్సులు

నిమ్స్‌లో మంత్రి హరీశ్‌రావును నర్సులు కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 25 రోజుల నుంచి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని చెప్పారు.

200 మంది ఉన్నామని, నిమ్స్ పెన్షన్ స్కీమ్ కావాలని, దానికి సహకారాన్ని అందించాలని మంత్రిని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో కనకతార, శాంతి తదితరులు ఉన్నారు.

అనవసర
పరీక్షలు, మందులు వద్దు

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ప్రజలకు అవసరం లేని పరీక్షలు చేయొద్దనీ, రోగులకు అనవసరమైన మందులివ్వొద్దని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. శనివారం హైదరాబాద్ బేగంపేటలో ఆయన ఒక ప్రయివేటు ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మెడికల్ హబ్‌గా రాష్ట్రం మారిందనీ, రాబోయే కాలంలో మెడికల్ కాలేజీలతో పెద్ద ఎత్తున వైద్యులొస్తారని చెప్పారు.

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లోనే ఎక్కువగా అయయవమార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. పేదలకు కార్పొరేట్ ఆస్పత్రులు మంచి వైద్యం అందించాలని కోరారు.

నిమ్స్ ఆస్పత్రిని బలోపేతం చేస్తాం

నిమ్స్ ఆస్పత్రిని మరింత బలోపేతం చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. శనివారం పంజగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో రూ.రెండు కోట్ల విలువైన ఇంట్రా ఆపరేటివ్ ఆల్ట్రా సౌండ్, ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్, ఆల్ట్రా సోనిక్ ఆస్పిరేట్ వైద్య పరికరాలను ట్రామా బ్లాక్ మంత్రి ప్రారంభించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా వస్క్యులర్ సర్జరీ సదస్సు నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. నైపుణ్య శిక్షణకు ముందుకొచ్చిన ప్రముఖ కిడ్నీ స్పెషలిస్టు దామోదర్ రెడ్డి కుంబాలను ప్రశంసించారు. డయాలసిస్ సేవల్లో తెలంగాణ మోడల్‌ను స్వీకరిస్తున్నట్టు తమిళనాడు సీఎం స్టాలిన్ చెప్పడం రాష్ట్రం కిడ్నీ రోగులకు అందిస్తున్న సేవలకు నిదర్శనమని తెలిపారు. నిమ్స్‌లో ప్రొఫెసర్ పోస్టులన్నింటిని భర్తీ చేస్తామని హామి ఇచ్చారు. పరికరాల కొనుగోలు కోసం గతేడాది రూ.150 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

ఇంకెంత నాశనం చేస్తారు?

- భద్రాచలం విభజనపై సిపిఎం ఆగ్రహం
- మూడు గ్రామ పంచాయతీల ఏర్పాటుపై బంద్‌కు పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పట్టణం ఇప్పటికే పాలకుల నిర్లక్ష్యం వల్ల తీవ్రంగా నష్టపోయిందని, మరలా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలాన్ని మూడు గ్రామ పంచాయతీలుగా విభజించడంపై సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 19న భద్రాచలం బంద్‌కు పిలుపునిచ్చినట్టు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాలను ఎపిలో కలిపారని, జిల్లాల విభజన పేరుతో వాజేడు, వెంకటాపురం రెండు మండలాలను ములుగు జిల్లాలో కలిపారని తెలిపారు. విభజనలో భాగంగా భద్రాచలం పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ, రాజుపేటలోని కొంత భాగం, జగదీష్ కాలనీ, సుందరయ్య కాలనీలోని కొంత భాగాన్ని ఏటపాక మండలంలో కలిపి భద్రాచలాన్ని ఒక కుగ్రామంగా మార్చి అభివృద్ధికి నోచుకోకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ పట్టణాన్ని మూడు గ్రామ పంచాయతీలుగా విభజించి భద్రాచలం చారిత్రకతను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి భద్రాచలాన్ని మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విభజనను నిరసిస్తూ 19న బంద్‌కు పిలుపునిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో దీనిపై అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తామని, ఈ నెల 28న భద్రాచలం వస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిసి వివరించి దరఖాస్తు ఇస్తామన్నారు. పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వైవి రామారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు లబ్ధిదారులకు ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు బంద్

- వెబ్‌సైట్‌లో ప్రభుత్వం మార్పులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో దళిత బంధు కింద లబ్ధిపొందిన కుటుంబాలను ఎస్‌సి కార్పొరేషన్ పరిధిలోని ఇతర పథకాల నుంచి మినహాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎస్‌సి కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో సాంకేతిక మార్పులు చేస్తోంది. లబ్ధిదారుడి ఆధార్, రేషన్‌కార్డు సహాయంతో సాఫ్ట్‌వేర్ ద్వారా వడపోత ప్రక్రియ పూర్తిచేయనుంది. దళితబంధు పథకం కింద లబ్ధిదారులైన ఒక్కో ఎస్‌సి కుటుంబానికి రూ.10లక్షల విలువైన యూనిట్‌ను సర్కారు మంజూరు చేస్తోంది. వీటి ద్వారా ఉపాధి పొంది ఆర్థిక సాధికారత సాధించాలన్నది లక్ష్యం. ఈ పథకం కింద ఇప్పటివరకు 38,476 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో 90 శాతం యూనిట్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అందజేసింది. ఇప్పటి వరకు రూ.3,300 కోట్లకు పైగా ఈ పథకం కింద వెచ్చించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రస్తుతం ఎమ్మెల్యేల సిఫారసు మేరకు జరుగుతోంది. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో... లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సిఫారసు అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి నియోజకవర్గాలవారీగా లబ్ధిదారుల ఎంపిక నిలిచిపోయింది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల స్వీకరణపై ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న విషయమై ఎస్‌సి కార్పొరేషన్ సమాలోచనలు చేస్తోంది. సాధారణంగా ఎస్‌సి కార్పొరేషన్ కింద రాయితీ రుణాలు, ఇతర ఆర్థిక పథకాల కింద ఒకసారి లబ్ధిపొందిన కుటుంబాలకు అయిదేళ్ల పాటు తదుపరి ఎంపికలో అవకాశమివ్వరు. అదే విధంగా దళితబంధు పథకం కింద ఒకసారి లబ్ధిపొందిన వారికి, ఇక ఎస్‌సి కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న రాయితీ రుణాలు, ఇతర ఆర్థిక సహకార పథకాల కింద ఎంపిక చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- స్కాలర్‌షిప్‌లు రద్దు చేసి కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ
- ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
విద్యావ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతోందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్నత విద్యాసంస్థలను కేటాయించడం లేదని విమర్శించారు. అయినా కేంద్రం తీరుపై బిజెపి రాష్ట్ర ఎంపిలు మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహించడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడమేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలనీ, ట్రిపుల్‌ఐటి, ఐఐఎం వంటి ఉన్నత విద్యా సంస్థలను మంజూరు చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ముగిసిన ఇందు అంత్యక్రియలు

- మంత్రి మల్లారెడ్డి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరామర్శిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో పాఠశాలకు వెళ్లి అదృశ్యమై శుక్రవారం దమ్మాయిగూడ చెరువులో శవమై తేలిన చిన్నారి ఇందు అంత్యక్రియలు శనివారం ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోలీసుల పహారా మధ్య ఇందు అంతిమయాత్ర కొనసాగింది. జవహర్‌నగర్ వాసులు చిన్నారికి కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకుముందు అంబేద్కర్‌నగర్‌లో చిన్నారి మృతదేహానికి కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి నివాళ్లర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి తక్షణ సాయంగా రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చిన్నారి మృతి బాధాకరమైందన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని.. ఈ విషయంపై ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దాతల సహాయంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. బాధిత కుటుంబంలో ఇద్దరు పిల్లలను గురుకులంలో చదివించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందు మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, బిఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.